18 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
సోమవారం | 31 మార్చి 2025 | పేజీలు 8




## నిర్దిష్ట సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ

బుక్కపట్నం మేజర్ న్యూస్ : సత్యసాయి జిల్లా

బుక్కపట్నం (ఆర్.ఓ) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ఏప్రిల్ 2 2025 నుండి ప్రారంభం కానుంది. ప్రజలకు వేచి ఉండే అవసరాన్ని తొలగించి, నమోదు ప్రక్రియను వేగవంతంగా, క్రమబ ద్ధంగా నిర్వహించేందుకు అమలు చేయబడుతోంది. ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఈ విధానం అమల్లో ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రజలు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని, నిర్దిష్ట సమయానికి తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. తద్వారా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, కార్యాలయాల్లో పనితీరు మరింత సమర్థవంతంగా కొనసాగుతుంది. త్వరలోనే సత్యసాయి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఈ విధానం అమలు చేయబడనుంది. జిల్లా అధికారులు తెలియజేశారు.

## జిల్లా కలెక్టరేట్‌లో “శ్రీ విశ్వావసు” నామ సంవత్సర “ఉగాది” ఉత్సవాలు





### సంప్రదాయ వస్త్రధారణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా అధికారులు

**ఎద్దులబండితో ఊరేగింపు, ప్రత్యేక పూజలు, ఉగాది పచ్చడి సేవనం, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం**

**అన్ని రంగాల్లో జిల్లాని ప్రగతి బాటలో తీసుకెళ్లేందుకు కృషి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**

అనంతపురము మేజర్ న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఆదివారం ఉగాది వేడుకలు - 2025 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా అధికారులు, తదిత రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంప్రదాయ వస్త్రాలైన తెల్ల చొక్కా, పంచెకట్టు, కండువాలు ధరించి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు హాజరయ్యారు. ముందుగా కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దులబండిలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్వయంగా రెవెన్యూ భవన్ వరకు నడుపుకుంటూ విచ్చేయగా, వారిని మంగళ వాయిద్యాలతో డిఆర్ఓ, ఆర్డీఓ, జిల్లా అధికారులు, తదితరులు స్వాగతించారు. అనంతరం రెవెన్యూ భవనంలో ఉగాది ఉత్సవాలను పండితుల మంత్రోచ్చారణల మధ్య జ్యోతి ప్రజ్వలన గావించి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. తదనంతరం చిన్నారుల నిర్వహించిన సాంస్కృతిక ఆకట్టుకున్నాయి.

మిగతా 4లో

## నిర్ణీత సమయంలోగా ఈద్గాల కు చేరుకోవాలి

### సూచించిన ప్రభుత్వ ఖాజీలు



రాయదుర్గం, మేజర్ న్యూస్: ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ ను పురస్కరిం చుకొని ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలకు నిర్ణీత సమయం లోగా చేరుకోవాలని ప్రభుత్వ ఖాజీలు మొహమ్మద్ సైఫుల్లా, అతావుర్ రహ్మాన్ తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియ జేశారు. ఆయా ఈద్గాల్లో నమాజ్ జరిగే వేళల గురించి వారితో పాటు ఆయా మసీదు కమిటీల

మిగతా 2లో




## రిజిస్ట్రేషన్ శాఖలో వినూత్న విధానం..




**పడిగాపులకు అవకాశం లేకుండా స్లాట్ బుకింగ్**

**ఏప్రిల్ 4వ తేదీ నుండి ప్రారంభం..**

అనంతపురం మేజర్ న్యూస్

ప్రజలు పడిగాపులు పడకుండా వారి సమయాన్ని ఆదా చేసే విధంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో వినూత్న విధానాన్ని అమలు చేసేందుకు సంకల్పించింది. అందులో భాగంగా ఈనెల 4వ తేదీ నుండి స్లాట్ విధానం అమలు చేయడం ఉన్నట్లు జిల్లా రిజిస్టర్ తెలిపారు. ఇది ప్రజలకు వేచి ఉండే అవసరాన్ని తొలగించి నమోదు ప్రక్రియను వేగవత్తంగా క్రమబద్ధంగా నిర్వహించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఈ విధానం అమల్లో ఉంటుందని, ప్రజలు ముందుగానే స్లాట్ బుక్ చేసుకొని నిర్దిష్ట సమయానికి తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చున్నారు. తద్వారా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యాలయంలో పనితీరు మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని జిల్లా రిజిస్టర్ అభిప్రాయపడ్డారు. త్వరలోనే అనంతపురం జిల్లాలోని అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఈ విధానం అమలు చేస్తామని ఆయన తెలిపారు.



## ఏప్రిల్ 1న ఓడిసి వారపు సంత వేలం

**ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్** : ఓబుల దేవర చెరువు మేజర్ పంచాయతీలో ప్రతివారం నిర్వహిస్తున్న వారపు సంత, బస్టాండ్ లోడింగ్, అన్ లోడింగ్ బహిరంగ వేలం పాటను ఏప్రిల్ 1 ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం నందు వేలం పాటను సర్పంచ్ గోవిందు అధ్యక్షతన నిర్వహిస్తు న్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. వేలంపాటలో పాల్గొని ఆశావహులు వారపు సంత 50,000, బస్టాండ్ లోడింగ్ అన్ లోడింగ్ 20,000 ధరావత్ చెల్లించి పాల్గొన వచ్చని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలవారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించవచ్చు అన్నారు.

## ఆవు దూడను కాపాడిన పశువైద్య సిబ్బంది



**శింగనమల,మేజర్ న్యూస్** : శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన తుమ్మల నరసయ్యకు చెందిన పాడి రైతు ఆవు ప్రసవించలేక తీవ్ర ఇబ్బంది పడుతోంది.పశువైద్య సిబ్బంది పరీక్షించి దూడను బయటికి తీయడానికి ప్రయత్నించగా, దూడ యొక్క తల వెనక్కు తిరిగి బయటకు తీయడానికి వీలు లేకపోవడం వలన ప్రయత్నించి విఫలమై డాక్టర్ పద్మనాభం కు రెఫర్ చేయడం జరిగింది.డాక్టర్ పద్మనాభం ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి సిజేరియన్ ఆపరేషన్ లేకుండానే దూడ యొక్క తలను సరిదిద్ది, బతికిన దూడను బయటకు తీయడం జరిగింది.దూడ,తల్లి ఆవు రెండు క్షేమంగా ఉండడంతో పాడి రైతు తుమ్మల నరసయ్య ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సలకం చెరువు పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అనిమల్ హస్బంద్రీ అసిస్టెంట్స్ రాజశేఖర్, ప్రవీణ్, జమ్మన్న పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్** : తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఆత్మకూరు మండల కేంద్రంలో రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ని తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం మహానుభావుడు నందమూరి తారక రామారావు స్థాపించారని కొనియాడారు. 43 ఏళ్లలో అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు సాధికార కమిటీ సభ్యులు అన్ని అనుబంధ కమిటీల నాయకులు స్థానిక సీనియర్ నాయకులు యువత మహిళా నాయకులు బూత్ కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జులు కుటుంబ సాధికార సారధులు తెలుగుదేశం పార్టీ క్రియాశీలకనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాడి రైతుకు ఆర్థిక సహాయం అందించిన దాసరి వెంకట రమణ



**శింనమల, మేజర్ న్యూస్** : శింనమల మండలం చిన్నజలాల పురం గ్రామానికి చెందిన పాడి రైతు మంగళ వెంకటేశ్వర్లకు నాగులగుడ్డం దాసరి వెంకట రమణ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలోకి వెళితే గత మూడు రోజుల క్రితం వరిగడ్డి, వేరుశనగ వామి ప్రమాదవుశాత్తు కాలి బూడిదయింది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు దాసరి వెంకట రమణ నష్టపోయిన రైతు మంగళ వెంకటేశ్వర్లకు పదివేలు ఆర్థిక సహాయం అందజేశారు.పశువుల మేతకోతం ట్రాక్టర్ గడ్డి అందిస్తామని హామినిచ్చారు.ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, నాగలగుడం ఆది, మల్లి, సాయి, గంగాధర, క్షణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడిన క్రిష్ణ జింకను కాపాడిన గ్రామస్తులు

**అగళి మేజర్ న్యూస్**: నీటి కోసం వచ్చి మెట్లు లేని బావిలో పడిన కృష్ణ జింకను గ్రామస్తులు రక్షించారు. మండల పరిధిలోని కసాపురం గ్రామంలో బావిలో జింక పడిన విషయాన్ని గమనించిన లైన్మెన్ నరసింహమూర్తి అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. 20 అడుగుల లోతు ఉన్న ఈ బావిలోకి ఇద్దరు గ్రామస్తులు షాంభోగ నాగరాజు, కుమారి,లైన్మెన్ కృష్ణ ,లు దిగి జింకను సురక్షితంగా బయటకు తీసుకొచ్చి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. బయటకు తీసిన కృష్ణ జింకకు నీళ్లు తాగించి ఫారెస్ట్ ఆఫీసర్ సంజీవరాయుడు, సిబ్బంది భీమన్న గార్డు నాగరాజులు అక్కడే జింకను వదిలేశారు. మండలంలో అటవీ భూములు కూడా లేవు కానీ కసాపురం గ్రామంలో దొరికిన జింక ఎక్కడి నుంచి వచ్చిందో తెలియటం లేదు.







## శివ బాలయోగి ఆశ్రమంలో ప్రారంభమైన వసంత నవరాత్రి మహోత్సవాలు..

**అనంతపురం విద్య మేజర్ న్యూస్** : చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం నుండి చైత్ర శుద్ధ నవమి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రి వేడుకలు శ్రీ శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా మహిళా మండలి వారి ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి సామూహికంగా తొమ్మిది పర్యాయాలు శ్రీ మణిద్వీప వర్ణన పారాయణము, శ్రీదేవి ఖడ్గమాల పారాయణము, మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం నిర్వహించను న్నారు. ఆదివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మృతి.



**మడకశిర మేజర్ న్యూస్**: మండల పరిధిలో ని బుడ్డయ్య పాళ్యం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్సార్ సిపి మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలకప్ప, నాయకులు కలిసి ఆదివారం బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చేరుకొని వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మృతిని కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, ఎల్లవేళలా కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి,మండల కన్వీనర్ రామిరెడ్డి,వైసీ బాల రెడ్డి, కురుబ శేషాద్రి, నాగభూషణ్ రెడ్డి, మంజునాథ్, మల్లి నాయికనపల్లి బాలు రెడ్డి, నరేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బెలుగుప్ప మండలంలో ఘనంగా ఉగాది పండుగ



బెలుగుప్ప, మేజర్ న్యూస్ : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఉగాది పండుగను ప్రజలు వైభవంగా చేసుకున్నారు. ఉదయం నుంచి అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో స్వామి వార్లకు ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా బెలుగుప్ప గ్రామంలోని శ్రీ మంజునాథ దేవాలయంలో పురోహితులు చిరంజీవి పూజలు నిర్వహించి ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక శ్రావణమును గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులకు చదివి వినిపించారు. ఈ సంవత్సరము వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, ఎర్ర ధాన్యం బాగా పండుతుందని, ఎర్ర ధాన్యం పండించే రైతులకు ఆశ జనకంగా ఉంటుందన్నారు. వాహందారులు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలని పురోహితులు తెలిపారు. తెలుగు సంవత్సరాల్లో మొదటిది ప్రభవ, చివరిది అక్షయ, చైత్రమాసంలో శుక్లపక్షంలో సూర్యోదయ వేళలో పాడ్యమి తిది రోజున ఉగాది పండుగ చేసుకుంటామని, ఈ సంవత్సరం విశ్వా వసు నామ సంవత్సరం పేరు గా ఉగాది పండుగ చేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అనంతమ్మ వీణ కుమారి, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లత్తవరం గ్రామంలో ఉగాది పర్వదిన వేడుకలు

### కొండమీద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉరవకొండ, మేజర్ న్యూస్ : మండలంలోని లత్తవరం గ్రామంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ బోధపాటి గోవిందప్ప, కొర్రపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో కొండమీద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నరసింహ స్వామి ఉత్సవమూర్తిని అందంగా అలంకరించి ఎద్దుల బండి పై కొలువు దీర్చి గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీధుల్లో రహదారుల వెంబడి పెద్దలు, పిల్లలు చెక్కభజన నృత్యాలు చేయడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిర్ణీత సమయంలోగా ఈద్గాల కు చేరుకోవాలి

▸▸ మొదటి పేజీ తరువాయి

నిర్వాహకులు తెలియజేశారు. **ఇద్గాల్లో ఈద్ నమాజ్ వేళలు :** బళ్లారి రోడ్ ఈద్గా మైదానంలో నమాజ్ సమయం: ఉదయం 8.15 గంటలకు , కణేకల్ రోడ్డు ఈద్గా మైదానంలో నమాజ్ సమయం: ఉదయం 7.15 గంటలకు , బీటీపీ బైపాస్ రోడ్డు ఈద్గా మైదానంలో నమాజ్ సమయం : ఉదయం 7:30 గంటలకు , బళ్లారి రోడ్ దర్గా మసీదులో నమాజ్ సమయం ఉదయం 8:45 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుందని ఆయా మసీదు కమిటీల నిర్వాకులు తెలిపారు.

## శ్రీ నట్లో భైరవ స్వామిని దర్శించుకున్న ఆకుల బాబు



నార్పల,మేజర్ న్యూస్ : నార్పల మండలం కర్ణపుడికి గ్రామ టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు శ్రీ నట్లో భైరవ స్వామిని నార్పల మండల టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ దర్శించుకోవడం జరిగింది.ఆయనకు ఆగ్రామ టిడిపి నాయకులు డప్పు వాయిద్యాలు మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ నట్లు భైరవ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కర్ణపుడికి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆర్యవైశ్య స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్

డి. హీరేహాళ్ మేజర్ న్యూస్ : ఎండ తీవ్రత అధికం ఉండడంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని చలివేంద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాగలి రాజు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు తాగునీటి వసతి అందుబాటులో ఉండే విధంగా కృషి చేసిన నాగల్లి రాజుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు బీరుగుడా తిప్పేస్వామి, వన్నూరు స్వామి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# గడువు పొడిగింపు..!

## - ఏప్రిల్ 30 వరకు ఈ కేవైసీ కి అవకాశం

## - బియ్యం కార్డుదారులకు ఊరట

**తాడిపత్రి, మేజర్ న్యూస్:** బియ్యం కార్డు దారుల ఈ కేవైసీ నమోదుకు పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ 30 వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఈనెల 30 వ తేదీ వరకే సమయం ఉందని అధికారులు చెప్పారు. తాడిపత్రి మండలంలో మొత్తం 1,40,366 రేషన్ కార్డులు ఉండగా12,641మంది ఇంకా ఈ కేవైసీ చేయించుకోకుండా మిగిలిపోయారు. చాలామందిలో సందేహాలు ఉండటం, ప్రస్తుతం పరీక్షల కారణంగా పిల్లలు అందుబాటులో లేకపోవడంతో ఇది అనివార్యమైంది.

**నమోదుకు సమస్యలు ఎన్నో..!**

బియ్యం కార్డు దారుల ఈ కేవైసీ నమోదు చేయించాలని కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎవరెవరు చేయించుకోవలసిందో ఆ వివరాలను అధికారులు డీలర్లు, వీఆర్వోలకు పంపారు. అయితే వాటిని లబ్ధిదారులకు తెలియజేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఒక కుటుంబానికి చెందిన నలుగురిలో గతంలోనే ముగ్గురు ఈ కేవైసీ పూర్తి చేసినా ప్రస్తుత సాఫ్ట్వేర్ లో ఆ కుటుంబం మొత్తానికి చేయాలన్నట్లు చూపుతోంది. దీంతో గందరగోళానికి గురైన డీలర్లు కుటుంబంలోని అందరి వద్ద ఈ కేవైసీ చేయించుకుంటున్నారు.

**సమాచారం ఇస్తే మేలు..!**

చాలామంది కార్డుదారుల్లో ఎవరెవరు ఈ కేవైసీ చేయించుకోవాలో తెలియని పరిస్థితి. ఎందుకంటే గత ప్రభుత్వంలో మ్యాపింగ్ పేరుతో చేపట్టిన ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎంపీల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టనున్నారు. ఇందుకు కార్డుదారులు ఈ– పోస్ యంత్రంలో వేలిముద్ర వేస్తారు. ఇదే సమయంలో ఆ కార్డులో ఎవరెవరు ఈ కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందో ఆ వివరాలు కార్డుదారులకు తెలియజేస్తే వారు వచ్చే అవకాశం ఉంది. ఇక చాలామంది ఐదేళ్ల తర్వాత వారు పిల్లల వేలిముద్రలు అప్డేట్ చేయలేదు. దీంతో వీరు ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఈ – పోస్ లేదా సచివాలయంలో బియ్యం కార్డుల్లో ఈ కేవైసీ నమోదు చేసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.

## తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మరు




**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** పరిటాల కుటుంబం రాప్తాడు నియోజకవర్గం లో చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అతని మాటలు నమ్మే పరిస్థితుల్లో నియోజవర్గ ప్రజలు లేరని టిడిపి ఆత్మకూరు మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పరిటాల రవీంద్ర పేరు వింటేనే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి నిద్ర కూడా పట్టదని, ఆయన ఉన్నంతకాలం ప్రకాష్ రెడ్డి జిల్లా వదిలి ఎక్కడ దాక్కున్నావో జిల్లా ప్రజలకు తెలుసు అన్నారు. పరిటాల కుటుంబం పై ఏకవచనం తో ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు మీకు రాజకీయ భవిష్యత్తు కూడా లేకుండా చేస్తారన్నారు.రామగిరి మండల ఎంపీపీ ఎన్నికలకు సంబందించి నిజంగా కోరం ఉంటే మీ పార్టీ సభ్యులను రామేశ్వరంకు ఎందుకు తరలించారో సమాధానం చెప్పాలన్నారు. ప్రకాష్ రెడ్డి రాజకీయ ఉనికి కోసం పచ్చని గ్రామాల్లో చిచ్చులు పెట్టి రాజకీయ పబ్బం గడపాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ కులానికి చెందిన పోలీస్ అధికారి పై ఇష్టానుసారంగా నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.2019 నుంచి 2024 వరకు వైసిపి పాలనలో రాప్తాడు నియోజకవర్గం లో మీ కుటుంబం చేసిన దోపిడీ, దొంగల పాలన ప్రజలు ఇంకా మరువలేదన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గం లో ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

## వేడుకగా ఆంజనేయ స్వామి గ్రామోత్సవం



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని తొమ్మిదవ వార్డు పాతపేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. విశ్వా వసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు ఉదయాన్నే స్వామి వారి మూల విరాట్ కు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించి వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం పణీ స్వామి ఆధ్వర్యంలో భక్తులకు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. తదుపరి ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని అందంగా అలంకరించి రథంపై కొలువు దీర్చి ఊరేగించారు. గ్రామోత్సవం ఆలయం నుంచి పురవీధుల వెంబడి సిండికేట్ బ్యాంకు వద్ద ఉన్న రాములవారి ఆలయం వరకు ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. గ్రామోత్సవంలో భాగంగా దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని ఫల పుష్ప నారికేళం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉమేష్ బాబు, కార్యదర్శి గుండార్పు వెంకటరమణ, ప్యారం కేశవానంద, సి గోవిందు, త్రీలోక్నాథ్, రవీంద్రనాథ్, భువనేశ్వర్ చౌదరి, ఆర్ భీమప్ప, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**రాయదుర్గం, మేజర్ న్యూస్:** రాయదుర్గం పట్టణం ఉగాది పండుగ రోజున విషాదం అలుముకుంది. బళ్లారి రోడ్డులోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఏకబోటి విజయలక్ష్మి (60) పనుల నిమిత్తం బయటకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్ళడానికి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొనింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జయలక్ష్మిని స్థానికులు హుటా హుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ప్రమాదానికి కారణం అతివేగమే అని స్థానికులు తెలిపారు. అసలే ఉగాది , రంజాన్ పండుగల వేళ రోడ్లన్నీ రద్దీ గా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వేగంగా రావడం , రోడ్డు దాటుతున్న ఆమెను ఢీ కొనడంతో ఈ సంఘటన జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదం లో మృతి చెందిన ఆమె అవివాహిత కాగా చెల్లెలితో కలిసి ఉంటున్నట్టు సమాచారం. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న ఇద్దరు యువకులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఈ యువకులు మండలంలోని మల్లాపురం వాసులు గా స్థానికులు తెలుపారు. ఈ ఘటనపై అర్బన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు మృతురాలి బంధువులు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### 37వ డివిజన్ లో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

**టిడిపి నాయకుడు దాదా ఖలందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న టిడిపి నాయకులు గంగారామ్, సుందర్**



**అనంతపురం మేజర్ న్యూస్ ప్రతినిధి :** అనంతపురం నగరంలో మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సుందర్ తెలిపారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్ఫూర్తితో 37వ డివిజన్ టిడిపి నాయకుడు దాదా కలందర్ ఆధ్వర్యంలో నేడు మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సుందర్, రాయలసీమ బలిజ సంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర నాయకుడు చేపల హరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా 37వ డివిజన్ లోని కార్మికులకు తమ వంతు సాయంగా దుస్తుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికుల చేసిన సేవలను మర్చిపోలేము అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు భక్తవత్సలం నాయుడు, కరీం భాష, బోయ శ్రీనివాసులు, బోయ నరేష్ కుమార్, రాజా బాబు, నాసిర్, ఇర్ఫాన్, తెలుగు మహిళలు పార్వతమ్మ, ప్రమీల, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సామాజిక సేవకు ఉగాది పురస్కారం

### వేడుకగా ఉగాది పర్వదిన వేడుకలు



**ఉరవకొండ, మేజర్ న్యూస్:** ఆపదలో ఉన్న బాధితులకు రక్తదానం చేస్తూ, మరొకరికి ప్రాణం పోస్తూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన ఆపద్బాంధవ ట్రస్ట్ సేవలు అభినందనీయమని , ట్రస్ట్ వ్యవస్థాపకులు వేల్పుల మురళిని ఉత్తమ ఉగాది పురస్కారంతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని గవి మఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి, ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చిన్న గౌస్ అన్నారు. ఆదివారం శ్రీ విశ్వా వసు నామ సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకలను నిస్వార్థ, ఆయుర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రతినిధులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి తెలుగు ధనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం తెలుగు తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. తదుపరి ప్రసిద్ధ శైవ క్షేత్రం గవి మఠంలో ఉగాది పంచాంగ శ్రవణం వినిపించారు. జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవలో భాగంగా రక్తదానం, అనాథ మృతదేహాలకు అంతక్రియలు జరపడం ఇలాంటి ఎన్నో సేవలందించి జిల్లా వ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందుతున్న ఆపద్బాంధవ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేల్పుల మురళికి ఉత్తమ ఉగాది పురస్కారం అందించారు. ఆయనను శాలువలతో పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఆపద్బాంధవ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేల్పుల మురళి ఉత్తమ ఉగాది పురస్కారాన్ని ట్రస్టు సభ్యులకు అంకితం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్ సంస్థ వెంకట్ గురూజీ, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 4 నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభం

**అనంతపురం మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా కేంద్రంలోని రామనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ 4 నుండి స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభమవుతుందని జిల్లా సబ్ రిజిస్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంతో ప్రజలకు వేచి ఉండే అవసరాన్ని తొలగించి, నమోదు ప్రక్రియను వేగవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అమలు చేయబడుతోందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఈ విధానం అమల్లో ఉంటుందని సబ్ రిజిస్టర్ తెలిపారు.ఈ విధానం ద్వారా ప్రజలు ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని, నిర్దిష్ట సమయానికి తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. తద్వారా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, కార్యాలయాల్లో పనితీరు మరింత సమర్థవంతంగా కొనసాగుతుందన్నారు. త్వరలోనే అనంతపురం జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఈ విధానం అమలవుతుందని సబ్ రిజిస్టర్ తెలిపారు.

## పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా భారీ శాంతి ర్యాలీ



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్ :** క్రైస్తవ ప్రబోధకుడు పగడాల ప్రవీణ్ అకాల మరణం సంతాపంగా అనంతపురం నగరంలో క్రైస్తవులందరూ ఆదివారం సాయంత్రం నగరంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాస్పల్ హాల్ అసెంబ్లీ దగ్గర పాస్టర్ వరప్రసాద్ రెడ్డి ప్రార్థనతో ప్రారంభమైన ర్యాలీ, అక్కడి నుండి కొవ్వొత్తులతో క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్ ఐ యు చర్చ్ వరకు మౌన ప్రదర్శన గా ఎస్ఐయు చర్చి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు ప్రవీణ్ పగడాలకు సంతాపం తెలుపగా సిఎస్ఐ చర్చ్ పాస్టర్ బెన్హర్ బాబు చివరి సందేశాన్ని అందించారు.,లో అనంతరం ఎస్ ఐ యు చర్చి పాస్టర్ సంపత్ విజయకుమార్ ప్రార్థన ఆశీర్వాదాలతో ఈ ర్యాలీని ముగించారు. ఈ సందర్భంగా నగరంలోని క్రైస్తవులందరూ ముక్తకంఠంతో ప్రవీణ్ పగడాల యొక్క మరణం సంబంధించిన అనుమానాలను ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి సరియైన న్యాయాన్ని జరిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ శాంతి ర్యాలీలో అనంతపురం పాస్టర్ల సంఘాల అధ్యక్షులు నెహెమ్యా నాగరాజు, మోజెస్ అనిల్ కుమార్, ఐజయ్య, హెర్ మోన్ చర్చ్ పాస్టర్ ఐజయ్య,పాస్టర్లు రఘునాథ్ డేనియల్,టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి కాంతి జాన్ వెస్లీ, ఏఐసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఐ సి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్ రావు ఫీబా జయరాజ్ అనంతపురంలోని క్రైస్తవులందరూ పెద్ద ఎత్తున శాంతి ర్యాలీలో పాల్గొని తమ యొక్క సంఘీభావాన్ని తెలియజేశారు.





# శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా "ఉగాది" వేడుకలు.

**పుట్టపర్తి. మేజర్ న్యూస్:** తెలుగు సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ ఉగాది పండుగ ప్రజలందరికీ శుభాలు చేకూర్చాలని, ప్రజల జీవితాలలో వెలుగు నింపాలని, ఈ ఏడాది జిల్లా ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో గడపాలని, ఆయురారోగ్యాలను ప్రసాదించి సకాలంలో వర్షాలు కురిపించి పాడిపంటలు సమృద్ధిగా ఉండేలా కలిసి రావాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కలెక్టర్ కార్యాల యంలోని సమావేశ మందిరంలో "ఉగాది ఉత్సవ" వేడుకలు ఘనంగా జరిగాయి. ఉగాది వేడుకల్లో భాగంగా పండితులు మంత్రోచ్ఛార ణాల తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, డిఆర్ఓ విజయసారథి, పుట్టపర్తి డిఎస్పి విజయకుమార్, డిఆర్డిఏ పిడి మరియు పర్యాటక శాఖ ఇంచార్జ్ అధికారి నరసయ్య, మేనేజర్ ప్రతాపరెడ్డి, వేద పండితులు పలువురు అధికారులు, పాత్రికేయులు, కవులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీ వానవోలు నాగరాజ శర్మ జిల్లా కలెక్టర్ తదితరులకు వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, సాంకేతిక పరిజ్ఞానం బాగా వృద్ధి చెందుతుందని తద్వారా మానవ శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుం దని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుకూల ఫలితాలను ఇస్తాయని, వాణిజ్యపరమైన పంటలు అధికమవుతాయని, మద్దతు ధర లభిస్తుందని వాణిజ్య పంటల దిగుమతి బాగుంటుందని, మొత్తం మీద వ్యవసాయానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని, భగవంతుని దయవల్ల వాణిజ్య పంటలు రైతులను ఆదుకుంటాయనే విషయాలను పంచాంగంలో తెలిపారు. ఆ తర్వాత ధర్మవరం కి చెందిన మానస నృత్య కళా నిలయం బృందం సాంప్రదాయ సాంస్కృతిక నృత్య ప్రదర్శన , ఉగాది సందర్భంగా ప్రముఖ కవుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం , వేద పండితులకు జిల్లా కలెక్టర్ ద్వారా సన్మానం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది పండుగ ప్రజలందరికీ శుభాలు చేకూర్చాలని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా జిల్లాను ప్రగతి పథంలో నిలపాలని, పేదరిక నిర్మూలనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగ సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువుగా తీసుకెళ్లి, అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందించే విధంగా పారదర్శకంగా సేవలు అందిస్తూ సత్ఫలితాలు సాధించే దిశగా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు.

**స్ఫూర్తి నింపిన కవి సమ్మేళనం:** విశ్వవసు ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆహూతులలో కొత్త చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపింది. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా, ఉద్దండం చంద్రశేఖర్, శివన్న,కవయిత్రి కొండసాని రజిత, తెలుగు పండితులు అమర చంద్రబాబు, మాణిక్యం ఇసాక్ ఉగాది కవితలను శ్రావ్యంగా గానం చేశారు.

అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హిందూపురం శ్రీ దక్షిణామూర్తి స్వామి దేవస్థానం అర్చకులు శ్రీ సత్యనారాయణ శాస్త్రి, శ్రీ చెన్నకేశవ వినాయక ఆంజనేయ స్వామి దేవస్థానం కూణతురు అర్చకులు శాంతేశ్వర ప్రసాద్, బుక్కపట్నం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు శ్రీ పంచరత్నం సుబ్రహ్మణ్యం శర్మ వేద పండితులకు దేవాదాయ శాఖ తరపున 62 సంవత్సరాలు పైబడి ఉన్న అర్చకులకు గౌరవ జిల్లా కలెక్టర్ ద్వారా సన్మానించి ఒక్కొక్కరికి రూ. 10, 116/ ప్రశంసా పత్రము అందజేశారు. కవులను, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాబృందాలను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకటనారాయణ, దేవాదాయ శాఖ అధికారి నరసింహరాజు, జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





# పట్టణంలో తీవ్ర విషాదం.

**- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానస్పద మృతి.**

**- అప్పుల బాధ, కుటుంబ కలహాలుగా ప్రాథమిక అంచనా.**

**- పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వివరిస్తాం.**

**- సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న, పెనుకొండ డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ట్రైనీ డిఎస్పి ఉదయపావని, పట్టణ సిఐ నగేష్ బాబు..**

మడకశిర, మేజర్ న్యూస్: స్థానిక పట్టణంలో ఆదివారం ఉగాది పండుగ రోజు తీవ్ర విషాదం చోటుచేసుకుంది . ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానస్పద మృతితో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకునే కుటుంబ సభ్యులు అనుమానాస్పద మృతితో వికటజీవులుగా పడి ఉండడం వారి కుటుంబ సభ్యులు, అదేవిధంగా స్థానిక ప్రజలు తీవ్ర దుఃఖంతో కన్నీటి పర్యంతమ య్యారు. వివరాల్లోకెళ్తే స్థానిక. గాంధీ బజార్ లో నివసిస్తున్న కృష్ణచారి(55), సరళ (38) దంపతులకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు సంతోష్(15) పట్టణ పరిధిలోని ఓ ప్రవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ఇటీవలే పబ్లిక్ పరీక్షలు ముగించుకొని, ఉగాది పండుగ కోసం ఇంటికి వచ్చాడు. రెండవ కుమారుడు భువనేష్ (13) సంతోష్ తో కలిసి శనివారం గాంధీ బజార్ లో ఉన్న తమ ఇంటికి తిరిగివచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కృష్ణ చారి కి తల్లి తండ్రి, ముగ్గురు అన్నా తమ్ముళ్లు, ఒక అక్క ఉందని స్థానికులు తెలిపారు. మృతుని తండ్రి మల్లాచారి ఆదివారం ఇంటి వద్దకు వచ్చి తలుపుతట్టగా ఎంతసేపటికి వారు తలుపులు తీయకపోవడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారని ఆయన తెలిపారు. అనంతరం పోలీసు అధికారులు వచ్చి తలుపు తీయగా కృష్ణ చారి సతీమణిసరళ, కుమారులు సంతోష్ భువనేష్ అనుమానస్పదంగా మృతి చెందారని పోలీసు అధికారులు తెలిపారు. మృతుడు కృష్ణ చారి బంగారు వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నారని, సతీమణి ఇంట్లో పనులు చూసుకుంటూ ఇంట్లోనే ఉండేదని తండ్రి మల్ల చారి, కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రత్న అదేవిధంగా పె నుకొండ డిఎస్పి వెంకటేశ్వర్లు, ట్రైనీ డిఎస్పి ఉదయపావని, సీఐ లు నగేష్ బాబు, రాజ్ కుమార్ అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులను విచారించగా అప్పుల బాధ అదేవిధంగా కుటుంబ కలహాలతో వారు ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రాథమికంగా పోలీస్ అధికారులు అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న మాట్లాడుతూ కృష్ణాచారి కుటుంబ సమేతంగా ఆత్మహత్యకు పాల్పడిన విషయాలను దర్యాప్తు అనంతరం వివరాలను అందిస్తామని ఆమె తెలిపారు.

# నేడు కూడా రిజిస్ట్రేషన్లకు అవకాశం

**తాడిపత్రి, మేజర్ న్యూస్:** ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఈ నెల 30,31 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదివారం ఉగాది నాడు కార్యాలయాలు పనిచేశాయి. సోమవారం రంజాన్ పర్వదినం నాడు కూడా కార్యాలయాలు తెరుచుకోనున్నాయి. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పనిచేస్తాయి. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్లు జరిగితే ఒక్కో లావాదేవికి రూ. 5 వేలు చొప్పున ప్రత్యేక రుసుము వసూలు చేస్తారు. ఇప్పుడు మాత్రం సాధారణ పని దినాలుగా పరిగణిస్తూ, ఎలాంటి ప్రత్యేక రుసుం లేకుండానే అవకాశం కల్పించారు. ఈ



మేరకు తాడిపత్రి సబ్ రిజిస్టర్ శివ నారాయణ ఆదివారం 'సూర్య ప్రతినిధి'తో మాట్లాడారు. ఉగాది, రంజాన్ పర్వదినాల్లో అంది వచ్చిన ఈ అవకాశాన్ని తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# గోవింద నామస్మరణంతో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

**చెన్నై కొత్తపల్లి :( మేజర్ న్యూస్ )** మండలంలోని మేడాపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి నుండి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. పులకాపం వేదిక మీద శనివారం రాత్రి స్వామివారిని గ్రామపంచాయతీ మంత్రాలు స్వామివారిని శుద్ధి చేసి అలంకరించి పూజారి నెత్తినఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు తమ కోర్కెలు తీర్చాలని కోరుతూ స్వామి వారి ముందు మోకరిల్లారు. తెల్లవారుజామున సూర్యోదయం కాకమునుపే స్వామివారు గుడికి చేరుకున్నారు. తదుపరి మూలవిరాట్కు ప్రత్యేక పూలు ఆభరణాలతో అలంకరించి భక్తుల దర్శనార్థం సిద్ధం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి సాయం కర్పూర తాంబూలాదులను సమర్పించి మృక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను తిప్పుతూ భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. తదుపరి ఆలయం నుండి ఓబులేసు స్వామిని ఎత్తుకొని పూజారి పులకాపం వేదిక వద్దకి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం పంజు సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు సాయంత్రం 6 గంటలకు పంజ సేవ కార్యక్రమం ముగిసింది.

# భక్తిశ్రద్ధలతో ఉగాది పండుగ

**తాడిమర్రి ,మేజర్ న్యూస్ :** తాడిమరి మండలంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో



ఉగాది పండగ నిర్వహించు కున్నారు ఈ సందర్భంగా ఉగాది అంటేనే మండలంలో మొదటగా పాడి పంటలు వ్యవసాయాలు పుష్కలంగా అభివృద్ధి చెందాలని అధిక పంటలు పండాలని మొదటగా మండలంలోని ఆత్మకూరు గ్రామంలోని శ్రీ పడమటి వీరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు ఇక్కడ మండలంలోని ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుంచి పడమటి వీరన్న స్వామికి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు తొలుత వారు స్వామివారికి తమ యొక్క పాడి అంటే ఆవు పాలు కానీ బర్రె పాలు కానీ ప్రత్యేకంగా భక్తిశ్రద్ధలతో పూర్తిగా తీసుకొని వచ్చి స్వామివారిపై అభిషేకిస్తారు అనంతరం స్వామివారికి టెంకాయలు కొట్టి బొరుగులు సమర్పిస్తారు అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు తొలుత వారి వారి గ్రామాల నుంచి ప్రత్యేకంగా అలంకరించుకున్న ఎడ్లబండ్లు ద్విచక్ర వాహనాలు మరియు ట్రాక్టర్ల ద్వారా వచ్చి స్వామివారి నామస్మరణ చేసుకుంటూ పడవటి వీరన్న స్వామి గోవిందా గోవిందా అంటూ స్వామివారి వద్దకు వచ్చి భక్తిశ్రద్ధలతో ఎంతో నియమ నిష్ఠలతో స్వామివారి దర్శనం చేసుకుని స్వామివారికి పూజలు నిర్వహిస్తారు అనంతరం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆత్మకూరు గ్రామవాసులు భోజన వసతి ఏర్పాటు చేశారు మండల కేంద్రంలోని శ్రీ తూర్పుముఖ ఆంజనేయస్వామి ,భవాని శంకర్ దేవాల యం, స్థానిక అమ్మవారి శాల, శ్రీ లక్ష్మీనరసింహస్వామి , శ్రీ లక్ష్మీ చెన్నకే శవ స్వామి ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి భక్తులు తెలుగువారి తొలి పండగ ఉగాది కావున ప్రతి ఒక్కరు దేవాలయాలకు వెళ్లి స్వామి వారిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారిని ఆశీర్వాదాలు పొందారు.

# ముగ్గురిపై దాడి.... ఇద్దరిపై కేసు నమోదు.

**ధర్మవరం మేజర్ న్యూస్:** పట్టణంలో ఓ వస్త్రదుకాణంలో జరిగిన గొడవ అనంతరం బయటకు వచ్చిన తరువాత ఇద్దరు ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హరీశ్, ఇషాక్ ఇద్దరు వస్త్ర దుకాణంలో బట్టలు తీసుకునే విషయంలో హరీశ్ అనే వ్యక్తి కాటమయ్య, రాజేష్, రాజేష్ లను పిలిపించారు. వారు వచ్చి వారిద్దరికి సర్దిచెప్పారు. ఆ తరువాత దుర్గానగర్ ఏటీఎం వద్ద కాటమ య్య, రాజేశ్, రాజులు ఉండగా శనివారం రాత్రి ఇషాక్ అతని అన్న అబ్దుల్ రెహమాన్లు కర్రలతో ఆ ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాదితుల పిర్యాదు మేరకు ఇషాక్, అబ్దుల్ రెహమాన్లపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.





# మామిళ్లకుంట క్రాస్ వద్ద రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

### మా పరిధిలోకి రాదంటూ పోలీసుల తట పటాయింపు

పుట్టపర్తి క్రైమ్ మేజర్ న్యూస్: శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మండలం మామిళ్ళకుంట క్రాస్ వద్ద రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. ఆదివారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం పడి ఉన్న ప్రాంతం కొత్తచెరువు పరిధిలోని దంటూ పుట్టపర్తి రూరల్ పోలీసులు, కాదు పుట్టపర్తి రూరల్ పరిధిలోకి వస్తుందంటూ కొత్తచెరువు పోలీసులు పట్టించుకోకపోవడంతో మృతదేహం రోడ్డుపైనే పడి ఉంది. మృతదేహం పడి ఉన్న తలభాగం కొత్తచెరువు పరిధిలోకే వస్తుందని రెవెన్యూ సహాయకులు చెప్పారు. కాళ్లు రోడ్డుపై ఉన్నందున పుట్టపర్తి పరిధిలోకే వస్తుందని కొత్తచెరువు రెవెన్యూ సహాయకులు ఇలా మృతదేహాన్ని అక్కడే ఉంచి గంటల తరబడి తట పటాయించారు. చివరకు సర్వేయర్ వచ్చి మృతదేహం పడి ఉన్న ప్రాంతం కొత్తచెరువు పరిధిలోకే వస్తుందని చెప్పిన తర్వాతనే మృతదేహాన్ని కొత్తచెరువు పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు.



## నీలకంఠాపురం దేవస్థానంలో ప్రత్యేక పంచాంగ శ్రవణం..

మడకశిర మేజర్ న్యూస్: మడకశిర మండలం నీలకంఠాపురం ఆలయంలో ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు అలంకరణ మరియు ప్రత్యేక పూజ తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు అనంతరం ఆలయంలో పంచాంగ శ్రవణం ప్రత్యేకంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ ఎన్,రఘువీరారెడ్డితో పాటు గ్రామ ప్రజలు భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు గా షైక్ జబిఉల్లా.



మడకశిర, మేజర్ న్యూస్: ముస్లిం ఐక్యవేధిక మడకశిర పట్టణ అధ్యక్షుడు గా షైక్ జబీ ఉల్లా ను నియమించినట్లు ముస్లిం ఐక్యవేధిక రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ అలీ మరియు జిల్లా అధ్యక్షుడు గోస్ ఖాన్, మడకశిర నియోజకవర్గ అధ్యక్షుడు వసీమ్ బేగ్ ఆదివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు జబీ ఉల్లా మాట్లాడుతూ, ముస్లిం మైనారిటీల యొక్క హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తూ, వారి సమస్యలపై పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. ముస్లిం ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు గా నియమించడం పట్ల రాష్ట్ర జిల్లా కార్యవర్గానికి, అదేవిధంగా నియోజకవర్గ కార్యవర్గానికి అయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగాది వేడుకలలో పాల్గొనడం సంతోషకరం..యం.ఆదినారాయణ



శింగనమల,మేజర్ న్యూస్ : తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలలో అధికారికంగా పాల్గొనే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజతలని రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ య.ఆదినారాయణ తెలియజేశారు.అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉగాది పండుగ కార్యక్రమంలో డైరెక్టర్ యం.ఆదినారాయణ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శ్రీ విశ్వవాసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉగాది పండుగ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ,డిఆర్ఓ మాలోల,జిల్లా అధికారులు, కవులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు నరసింహ స్వామి మాలాధారుల ఇరుముడి

రాయదుర్గం, మేజర్ న్యూస్: రాయదుర్గం మండలం , మల్లాపురం గ్రామ పరిధిలో వెలిసిన శ్రీ విప్ర మలై లక్ష్మి నవ నరసింహ స్వామి దీక్ష మాల ధారుల ఇరుముడి కార్యక్రమం నేడు ఉంటుందని ఆలయకమిటీ గౌరవాధ్యక్షులు శ్రీ రామ్మూర్తి స్వామీజీ ఆదివారం తెలిపారు. గత 41 రోజులకు పైగా మాలధీక్ష చేపట్టిన మలాధారులు సోమవారం ఉదయం 6 గంటలకు స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమం ఉంటుందని స్వామి తెలిపారు. అనంతరం లక్ష్మీ నవనరసింహ స్వామి ఆలయం వరకు పాదయాత్ర ద్వారా చేరుకుని మాలా విరమణ దీక్షా పూజలు, హెూమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు హాజరు కావాలని స్వామీజీ కోరారు.

## ఉగాది పర్వదినాన...
# ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన.





ధర్మవరం మేజర్ న్యూస్: ఉగాది పర్వదినం సందర్భంగా ధర్మవరం పట్టణంలోని కొత్తపేట శ్రీ వేంకేశ్వరస్వామి దేవాలయం నందు మానస నృత్య కళా కేంద్రం శిష్య బృందం నృత్య ప్రదర్శన చేయడం జరిగింది.ఈ కార్యక్రమం నందు మొత్తం 10 చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకోవడం జరిగింది. అనంతరం పిల్లలందరికీ కూడా దేవాలయం వారి చేతుల మీదుగా అభినందన పత్రం అందజేశారు.మహా గణపతిం భజే మానసం అదివో అల్లదివో వంటి నృత్యాలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకోవడం జరిగింది. అలాగే పుట్టపర్తి లోని కలెక్టర్ కార్యాలయం నందు శ్రీ విశ్వ వాసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు నిర్వహించడం జరిగింది. ఆ వేడుకలు నందు ధర్మవరం పట్టణం నుంచి మానస నృత్య కళా కేంద్రం వారు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం నందు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. గురువు మానస ప్రత్యేక నృత్య ప్రదర్శన అందరినీ ఆ కొట్టుకోవడం జరిగింది. ప్రదర్శన అనంతరం కలెక్టర్ చేతులమీదుగా మానస కి సన్మానించడం జరిగినది.

## వ్యక్తిగత గొడవల్ని పార్టీలకు ఆపాదించవద్దు

### రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో జరిగిన సంఘటన అనుకోకుండా జరిగింది

### గ్రామంలో ఎలాంటి ఫ్యాక్షన్, రాజకీయ గొడవలు లేవు

### ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రకటన



చెన్నేకొత్తపల్లి, మేజర్ న్యూస్: రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో జరిగిన సంఘటనకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామంలో ఉగాది పండుగ నేపథ్యంలో కొందరు తమ పెద్దల సమాధుల వద్ద, దేవాలయం వద్ద పూజలు చేసి వస్తుండగా.. ఒక చిన్న సంఘటనతో ఈ గొడవ మొదలైందన్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారని అన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత గొడవలతో జరిగిన సంఘటనలను కూడా వైసిపి నాయకులు పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు ఆపాదిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటివరకు పాపిరెడ్డి పల్లి గ్రామంలో ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలు లేవని వారు గుర్తు చేశారు. ఒక వ్యక్తి మరణాన్ని రాజకీయంగా వాడుకునేందుకు వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని... ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. పాపిరెడ్డి పల్లి గ్రామంలో జరిగిన సంఘటన పూర్తిగా వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు, రాజకీయ గొడవలను తెలుగుదేశం పార్టీ మరీ ముఖ్యంగా పరిటాల కుటుంబం ప్రోత్సహించదని సునీత, శ్రీరామ్ అన్నారు.

## ఆంధ్రప్రదేశ్ సీనియర్ రాష్ట్ర హాకీ జట్టులో ధర్మవరం క్రీడాకారులు.

### ఏప్రిల్ 4 వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఇండియా ఆధ్వర్యంలో హాకీ పోటీలు.

ధర్మవరం మేజర్ న్యూస్: హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఏప్రిల్ 4వతేదీ నుండి 15వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీ నగరంలో జరుగనున్న 15వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీలలో పాల్గొనే హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ప్రశాంత్, లోకేష్, ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్ తెలియజేశారు. మార్చి నెలలో గుంటూరు జరిగిన 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్లో శ్రీ సత్యసాయి జిల్లా హాకీ జట్టు రెండవ స్థానం సాధించడం జరిగినది. అందులో ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు. ఎంపికైన క్రీడాకారులకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రటరీ, బంధనాథం సూర్య ప్రకాష్, హాకీ సత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షులు. బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్ , హాకీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు బీ.వీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు, ఉడుముల రామచంద్ర,గౌరీ ప్రసాద్ , ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న,జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, శ్రీ సత్య సాయి జిల్లా హాకీ కోచ్ హసేన్, చంద్రశేఖర్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్ , అమునుద్దీన్ , కిరణ్ అభినందనలు తెలియజేశారు.








# ఉద్యమ సి రాజు

**ఫ్యాప్టో చైర్మన్ గా విజయ ప్రస్థానం**

**ఐక్య పోరాట నిర్మాణంలో దిట్ట...**

**ఏ ఉపాధ్యాయుడికి సమస్య ఉన్న ముందుండే నైజం...**

**ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గానూ సయ్యద్ సిరాజుద్దీన్ సక్సెస్..**

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ వర్గాల్లో పరిచయం అవసరం లేని పేరు సయ్యద్ సిరాజుద్దీన్. ఐక్య ఉపాధ్యాయ పోరాట నిర్మాణంలో దిట్ట. ఏ ఉపాధ్యాయుడికి సమస్య ఉన్న ముందుండి పరిష్కరించే నైజం ఆయన సొంతం. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పరమావధిగా సాగిన పయనంలో ఉద్యమ రాజుగా ఎదిగిన సయ్యద్ సిరాజుద్దీన్ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫ్యాప్టో అనంతపురం జిల్లా చైర్మన్ గా విజయప్రస్థానాన్ని ఓసారి పరిశీలిద్దాం. 2023 జనవరి 8వ తేదీన ఫ్యాప్టో చైర్మన్ గా సయ్యద్ సిరాజుద్దీన్ ఎన్నికయ్యారు. 2023 ఏప్రిల్ మూడో తేదీన ప్రారంభమైన పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలలో చిన్న తప్పిదాల వల్ల ఎనిమిది మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఆ సమయంలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ.. ఫ్యాప్టో తరపున ఎనిమిది మంది ఉపాధ్యాయుల సస్పెన్షన్ ను రీవోక్ చేయించడంలో విజయవంతం అయ్యారు. 2023 ఏప్రిల్ 25న అప్పటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నిరంకుశ వైఖరి ని నిరసిస్తూ.. అనంతపురం జిల్లాలో ఎస్ఎస్సి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఫ్యాప్టో నిర్ణయించిన మేరకు నల్ల బ్యాడ్జీలతో ఫ్యాప్టో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ విచిత్ర వైఖరి మానుకోవాలని హెచ్చరించారు. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న జీవో ఎంఎస్ నెంబర్ 47 లో అసంబద్ధాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో అన్ని రకాల ఉపాధ్యాయుల పదోన్నతులను మాన్యువల్ గా జరపాలని, ఆన్లైన్లో వద్దని, జీవోలో ఉన్న అసంబద్ధాలను సవరించాలని ఫ్యాప్టో తరపున డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 117, సిపిఎస్ పిఆర్సి బకాయిలు, 12వ పిఆర్సి నియామకం గురించి నిరసన గళం వినిపించారు. ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో దిట్టగా పేరుగాంచిన సిరాజుద్దీన్ 2023 అక్టోబర్ 18న ఫ్యాప్టో 12 గంటల నిరసన, ధర్నా కార్యక్రమాన్ని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి అనంతపురం జిల్లాలో విజయవంతం చేయడంలో చైర్మన్ సిరాజుద్దీన్ సక్సెస్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మంది విద్యార్థులు అప్పటి ప్రభుత్వ అ శాస్త్రీయ విధానాల వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని ఆవేదన వ్యక్తం చేస్తూ పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 2023 ఆగస్టు 19న ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అనంతపురం డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేతనాలు, వర్క్ అడ్జస్ట్మెంట్, జీవో నెంబర్ 117 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 25న ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎస్ అమలు జిపిఎస్ రద్దు అంశంపై చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని 2000 మంది ఉపాధ్యాయులతో ఉద్యమస్ఫూర్తితో నిర్వహించి ఉపాధ్యాయుల్లో జోష్ నింపారు.

2024 డిసెంబర్ 8వ తేదీన వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ బహిష్కరించాలని ఫ్యాప్టో తరపున పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియని బహిష్కరించి, ఉపాధ్యాయ సంఘాలు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇవి ఫ్యాప్టో చైర్మన్ గా సిరాజుద్దీన్ ప్రస్థానంలో మచ్చుకు మాత్రమే. ఉపాధ్యాయుల సమస్యల ను అనేకసార్లు ఆర్జెడి, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అందర్నీ కలుపుకొని ప్రాతినిథ్యాలు చేశారు.

**విపత్కర సమయంలో ఉద్యమ నేతగా రాణించిన సిరాజుద్దీన్.**

అప్పటి వైసిపి ప్రభుత్వం లో ఉపాధ్యాయుల ఉద్యమాలను తీవ్రంగా అణిచివేశారన్న అపవాదు ఉంది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యమ నేతగా రాణించిన సిరాజుద్దీన్ ప్రధానంగా పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వారు ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరోధించాలి. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జి.ఓ ఎం.ఎస్ నెం .117 ను రద్దు చేయాలి. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి. పదోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలి. సిపిఎస్ ను రద్దు చేయాలి . పిఆర్సి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలి . చట్టబద్ధమైన 12 వ పిఆర్సిని వెంటనే నియమించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి . ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11 వ పిఆర్సికి అనుగుణంగా పెంచాలి వంటి అంశాలను ప్రధాన అజెండాగా చేసుకొని సిరాజుద్దీన్ ఫ్యాప్టో చైర్మన్ గా పోరుబాట పట్టారు. అనేకసార్లు పోలీసుల నోటీసులు అందుకున్నారు. పోలీస్ స్టేషన్ మెట్లు కూడా ఎక్కారు.

**సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.. సిరాజుద్దీన్**

ఉపాధ్యాయ సమస్యల పరిష్కార పోరాటానికి ఫ్యాప్టో చక్కటి వేదిక. అలాంటి ఫ్యాప్టో అనంతపురం జిల్లా చైర్మన్ గా పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాను. తన పదవీకాలంలో సహకరించిన ఫ్యాప్టో రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు. తనకు సహకరించిన అన్ని సంఘాల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విద్యాశాఖ అధికారులకు సిరాజుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు తాను ముందుంటానని పునరుద్ఘాటించారు.






## ఘనంగా జెడ్పిటిసి డిసి అశోక్ కుమార్ కి జన్మదిన వేడుకలు

**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని మాస్టర్ యువర్ డిసి అశోక్ పవర్ లూమ్స్ మొగ్గాల ఫ్యాక్టరీ నందు వైయస్సార్ పార్టీ నాయకులు అభిమానులు పాత్రికేయులు పెద్ద ఎత్తున మండల జడ్పిటిసి బిసి అశోక్ కుమార్ కు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు ఒక్కొక్కరిగా తెలియజేశారు. మండలంలో జడ్పిటిసి గా అందరి మన్ననలు పొంది అభివృద్ధి వైపు పయనించి మృదుస్వభావి మంచికే నిలవెత్తు నిదర్శనమని పలువురు ఆయనను ఈ సందర్భంగా కొనియాడారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో మండలంలోని వివిధ పంచాయితీల నుండి మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాత్రికేయులు తొగట వీర క్షత్రియ కులస్తులు మాస్టర్ వీవర్స్ పెద్ద ఎత్తున వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

## ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ఆర్టీసీ బస్టాండ్ లో చలివేంద్రం.



### -యువర్ ఫౌండేషన్

**ధర్మవరం మేజర్ న్యూస్:** ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు యువర్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ.... విశ్వావసు నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలతో ఆర్టీసీ బస్టాండ్ నందు ప్రయాణికుల దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశ్యంతో ఈ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం అయినది. డిపో మేనేజర్ మాట్లాడుతూ.... యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నందు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమని, ఎక్కడి నుంచో ప్రయాణికులు వస్తూ ఉంటారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు దాహార్తిని తీర్చడం ఎంతో సంతోషమని అది యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యువర్ ఫౌండేషన్ సెక్రటరీ జయరాం, ట్రెజరర్ వంక దారి మోహన్, డాక్టర్ సుబ్బారావు, చాంద్ భాషా, రమేష్ బాబు, నత్రశాల మల్లికార్జున, ఓ వీ. ప్రసాద్, శీనా, సికిందర్, గీతా లోకేష్ మరియు యువర్స్ ఫౌండేషన్ సేవా సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవంకు ఏర్పాట్లు పూర్తి : ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని పాత ఊరిలో వెలిసిన తొగటవీర క్షత్రియ ఆరాధ్య దైవమైన చౌడేశ్వరి దేవి అమ్మవారి పంచము జ్యోతుల మహోత్సవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా తొగట వీర క్షత్రియ కులస్తులు ఈ సంవత్సరం కూడా జ్యోతుల తలపై ఎత్తుకొని నాట్యంతో పట్టణ పురవీధుల గుండా నృత్యాలతో కొనసాగడం ఆనవాయితీ. డిఎల్ రోడ్ మెయిన్ రోడ్ తదితర వీధులలో విద్యుత్ దీపాల అలంకరణతో మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల నుండి పంచమ జ్యోతుల మహోత్సవం జన సందోహం మధ్య నిర్వహించుకోబోతున్నామని వీటిని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తాదులు రావడం ప్రత్యేకంగా తెలుస్తోందని అందుకోసం ప్రతి ఒక్కరు అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కోరిన కోర్కెలు తీర్చే చౌడేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకుని తమ కోర్కెలు తీర్చుకోవాలని వివరించారు. గుడి ప్రాంగణమంతా ప్రత్యేక అలంకరణలతో నూతనంగా ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతోందని ఈ కార్యక్రమాలన్నిటికీ ఆలయ జ్యోతి కమిటీ వారు సహాయ సహకారాలతో ముందుకు సాగుతోందని అన్నారు. వచ్చిన భక్తాదులందరికీ తీర్థప్రసాదాలను ఆలయం తరుపున ఏర్పాటు చేయడం జరిగిందని భక్తాదులు ప్రసాదాలను స్వీకరించాలన్నారు. ఈ ఉత్సవాలు ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు నిండుగా ఉండాలని ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

## పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలి - క్రైస్తవ బోధకులు మత్తయ్య

**కనేకల్లు, మేజర్ న్యూస్ :** క్రైస్తవ బోధకులు ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి చెందిన విధానం అనుమానస్పదంగా ఉంద ని కనేకల్ క్రైస్తవ బోధకులు చర్చి పాస్టర్ మత్తయి అన్నారు. కనేకల్ మండల కేంద్రంలోని చర్చి నందు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటన కారణంగా న్యాయవిచారణ జరిపి ముద్దాయి లేవరో తేల్చాలని పాస్టర్ మత్తయి తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిని నిరసిస్తూ వారు ఆదివారం రోజున విలేకరుల సమావేశంలో పాస్టర్ ప్రవీణ మృతి పై కొద్ది నిమిషాలు ప్రగాఢమైన సంతపాన్ని తెలియజేశారు. తణుకు శత్రువులు ఎవరూ లేరని ఎవరో కావాలని దురుద్దేశంతో తనని పాస్టర్ను సమయం చూసి అతను బయటకు బైక్ మీద వెళుతుండగా మార్గమధ్యంలోన ప్రవీణ్ పగడాల ఉదయం రాజమండ్రి సమీపంలో బైక్ పైన పాస్టర్ ధరించిన తలకు హెల్మెట్ ధరించిన తల పైన తీవ్రమైన గాయాలతో పాటు సంఘటన స్థలములు కర్రలు పడి ఉండటంతో పాస్టర్ మృతి చెందలేదని ఎవరో కొంతమంది అదే పనిగా కావాలని హత్య చేసినట్లు ఆ స్థలములో పడి వేశారని అనుమానం కలుగుతుందని తెలిపారు. కావున ప్రవీణ్ పగడాల మృతి పై ప్రభుత్వం వారు దీనిపై విచారణ జరిపి అందుకు కారుకులైన వారిని శిక్షించాలని కనేకల్ చర్చి పాస్టర్ మత్తయి క్రైస్తవ బోధకులు తెలిపారు.

# రాయితీ సద్వినియోగం చేసుకోండి..!





**- గడువు ఒక్కరోజు మాత్రమే.. - అసెస్మెంట్ లు: 26 వేలు**

**- డిమాండ్ : రూ.11 కోట్లు - వసూళ్లు : 85 శాతం**

**తాడిపత్రి, మేజర్ న్యూస్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 -25 ముగిసేందుకు ఈనెల 31వ తేదీ ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నందున మున్సిపల్ పన్నుబకాయ దారులు పెద్ద ఎత్తున చెల్లింపులు చేస్తున్నారు. దీంతో నిత్యం తాడిపత్రి మున్సిపాలిటీకి సరాసరి ఆదాయం సమకూరుతోంది. పన్ను చెల్లింపుదారులకు ఇబ్బంది లేకుండా ఉగాది, రంజాన్ సెలవు రోజుల్లో కూడా నగదు కౌంటర్లు త్రిచి ఉంచి సిబ్బంది అందుబాటులో ఉండేలా రికార్డుల ఆదేశాలు ఇచ్చారు. ఏక మొత్తంలో పన్ను బకాయిలు, ప్రస్తుత ఏడాది డిమాండ్ చెల్లించే వారికి 50 శాతం రాయితీ ఉన్నందున అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కౌంటర్ పని చేస్తోంది. పన్ను చెల్లింపు దారుల సౌకర్యార్థం నగదు కౌంటర్లలోని రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండేలా సిబ్బంది సెలవులు రద్దు చేశారు. చెల్లింపుదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాటు చేశారు.

**ఉగాది రోజు 4,60,000 పన్ను వసూలు**

ఆదివారం సెలవు దినం ఉగాది పండుగ రోజు కూడా మున్సిపల్ అధికారులు పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ సిబ్బందితో కలిసి తాడిపత్రి పట్టణంలో రూ. 4,60,000 పన్ను వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ రెవెన్యూ అధికారి రవిబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అట్టహాసంగా రాతి దూల పోటీలు

**చెన్నేకొత్తపల్లి :( మేజర్ న్యూస్):** మండల కేంద్రంలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జనరల్ రాతి దూలం పోటీలు ఉగాది పండుగ శుభ సందర్భంగా నిర్వాహకులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ రాతి దూల పోటీలను సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ప్రారంభించారు . ఈ పోటీలో తొమ్మిది కాడలు పాల్గొన్నాయి. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు పరిటాల ట్రస్ట్ ఆర్థిక సహాయంతో గెలుపొందినవారు మొదటి బహుమతిగా తోపుదుర్తి చెన్నప్ప50 వేలు, రెండవ బహుమతి గార్లదిన్నె నరేష్ 40 వేలు,మూడో బహుమతి బళ్లారి ఆనంద్ 30 వేలు, నాలుగో బహుమతిగా సోమల దొడ్డి రామసుబ్బారెడ్డి 20వేలు, ఐదవ బహుమతిగా బేతంచెర్ల వెంకటరామిరెడ్డి10వేల రూపాయలు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

## వైసీపీ సమన్వయకర్త మెట్టును
## కలిసిన కనేకల్ నాయకులు



**కనేకల్లు, మేజర్ న్యూస్ :** ఉగాది పండగ సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డిని కనేకల్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయదుర్గం పార్టీ కార్యాలయం నందు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది నూతన సంవత్సర పర్వదినం నుండి రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు పంటలు బాగా పండి రైతులు ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి ఆకాంక్షించారని కనేకల్ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, ఆ రూరల్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు మారేన్న, ఆది, సద్గురు ఫర్టిలైజర్ షాప్ చంద్రశేఖర్ రెడ్డి, జిలాన్, హోళ్లి నాగరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్.. ఎమ్మెల్యే దగ్గుపాటి

**అర్బన్ నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు**

**అల్లా రక్షణ, కరుణ అందరిపై ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే**



**ఉద్గాలు, మసీదుల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్న దగ్గుపాటి**

**అనంతపురం, మేజర్ న్యూస్:** క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ముస్లిం సోదరీ సోదరిమణులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాస మంతా ఉపవాస దీక్షలు, దైవ ప్రార్ధనలతో సామరస్యం, ఆనందం కనిపించిందన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదర సోదరీ మణులంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారని అన్నారు. అల్లా రక్షణ, కరుణ అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దాన ధర్మాలు చేస్తారని, సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంత సంతోషంగా ఉంటుందన్నారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో రంజాన్ పండుగ కోసం ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. ముస్లిం సోదరులంతా సంయనంతో ప్రార్థనలు చేసి.. పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు.

## టిడిపి సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ



**గోరంట్ల, మేజర్ న్యూస్ :** గోరంట్ల పట్టణంలోని 4వ వార్డులోని జామియా మసీదు వీధి, వారపు సంత వీధి, పులేరు రోడ్డు తదితర ప్రాంతాల్లో కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను టీడీపీ మైనార్టీ కార్యదర్శి షేక్ అజ్మతుల్లా, మైనార్టీ నాయకులు ఉస్మాన్ ఖాన్, అమానుల్లా, రఫీక్ తదితరుల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లా
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎస్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
కళ్యాణ దుర్గం, శెట్టూరు, కంబదూరు,
బ్రహ్మసముద్రం, యాడికి, అమడగూరు,
గుడిబండ, అమరాపురం, కనగానపల్లి



## ఆలయ అర్చకులకు ఘన సత్కారం

**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నోహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అర్చకులను ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆదివారం ఘనంగా సత్కరించింది. దేవాలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్ బాబు ఆలయ సిబ్బందితో కలిసి ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ చార్యులు, ఉప ఆలయాల అర్చకులు మయూరం బాలాజీ చార్యులు, రామకృష్ణ, గుండురావు, సత్యనారాయణలను శాలువులతో పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఆలయ అధికారి సాకే రమేష్ బాబు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులకు నూతన దుస్తులను బహుకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ చార్యులు మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్త ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, అన్ని రకాల పంటలు బాగా పండి, రైతులతో పాటు యావన్మంది ప్రజలు జీవితం గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది దీపక్, మారుతి ప్రసాద్, రామకృష్ణ, దండా వెంకటేశులు, నరసింహులు, నాగేంద్ర, గ్రామ పెద్దలు నరేష్, చంద్రమౌళి, రామాంజనేయులు భక్తులు పాల్గొన్నారు.